వెళ్ళిన ప్రతి పంచాయితీలోనూ నదురుగా వున్న వాడొకడితో కథ నడిపించి వాడి పంచకి నిప్పంటించడమూ, అక్కడ చలి కాగడం పూర్తయ్యాక ట్రాన్స్ఫరైపోతూ మరోపంచె కోసమో, పేంటుకోసమో వెదుక్కోవడం ఆనవాయితీగా మార్చుకున్న ఆడది. ఈ మధ్యనే ట్రాన్స్ఫర్లమీద మొహం మొత్తి జిల్లా పరిషత్తు ఛైర్మన్‌తో మూడు రాత్రులు గడిపి ఆ ముసలాయన మొదటి మూడు రాత్రుల్ని మరిపింపచేసింది.

అదే కామేశ్వరి ధైర్యం....

అయినా "ఒళ్ళిచ్చిన వూర్లో పళ్ళూడగొట్టించుకోవడం" పాడి కాదని పాడి గేదెలా చంద్రంతో పర్మనెంటుగా సెటిలైపోదామని ఇప్పుడు శంకరయ్య లాంటివాడు ఛీ కొట్టి వెళ్ళేసరికి మందు కొట్టొచ్చిన చంద్రాన్ని పాములా చుట్టేసుకుని బావురుమంటూ ఏడ్చింది.

పల్లెలవారీగా ఎంతమంది ఆడపిల్లల కాపరాలు కూల్చింది ఎంతమంది మగాళ్ళతో సంబంధాలు పెట్టేసుకుని వాళ్ళలో వాళ్ళు తలలు పగలు గొట్టుకునేట్టు నాటకాలు నడిపిందీ చెప్పని కామేశ్వరి కట్టుకోకపోతే తల కొట్టుకు చస్తానూ అంటూ శంకరయ్య హెచ్చరిక గురించి చెప్పేసింది కూడా.

అంతకు పూర్వమే విషం తలకెక్కిన చంద్రం తండ్రి మంచం పట్టిన దానికన్నా ఎక్కువ కదిలిపోయాడు.

ఓ అరగంటసేపు కామేశ్వరితో గడిపి బయటికి వస్తూ చూశాడు. సరిగ్గా అతడు బయటికి వచ్చే వేళకి పావని, నానీ ఇంటిముందునుంచి వెళుతున్నారు.

భర్త కళ్ళలోకి ఓ క్షణంపాటు చూసి తల తిప్పుకున్న పావని నానీ కళ్ళల్లోకి సైతం చూడలేకపోయింది.

నానీని స్కూలు దగ్గర దింపి ఇంటికి వచ్చేసరికి సిద్ధంగా ఉన్నాడు చంద్రం.

"ఏమే....ఏబ్రాసి మొహందానా! స్కూలు కెళ్ళడానికి బోలెడన్ని తోవలున్నా ఆ ఇంటి ముందునుంచే వెళ్ళడంలో నీ వుద్దేశ్యమేంటే?" అన్నాడు పిడికిలితో జుట్టు పట్టుకుని.

అసలే నీరసంగా వున్న పావనికి ఏం జవాబు చెప్పాలో పాలు పోలేదు "నా మాటిని విడాకులకొప్పుకోవే. నెలకింతని చెల్లించుకుంటాను" ఉక్రోషంగా దగ్గరకు లాక్కుంటూ అన్నాడు.

"ఇన్ని రోజులుగా చెబుతున్నా నన్ను వదిలి పెట్టవేమే" అని గోడకేసి కొట్టాడు "మాట్లాడు" ఆమె మౌనం మరింత కోపాన్ని తెప్పిస్తుంటే గోడకేసి తల గుద్దుతున్నాడు ఆగకుండా.

పావని అంత బాధలోనూ తన భర్తనంత రాక్షసుడిగా మార్చిన కామేశ్వరి గురించే ఆలోచిస్తోంది.

అంతకుమించి ఏ తప్పూ చేయని తనను వదిలించుకోడానికి భర్త ఉపయోగిస్తున్న తర్కానికి విస్తుపోతోంది శరీరం హూనమైపోతుంటే.

"నేను మీకేమీ అడ్డం కాను.... మరోచోట భర్త వదిలిన భార్యగా బ్రతకనూ లేను. నన్ను కొట్టండి....చంపండి...అభ్యంతరంలేదు.... కాని మీరు చేస్తున్న నిర్వాకం ఆ పసివాడికి తెలియకుండా మాత్రం జాగ్రత్తపడండి. అది చాలు!".

నెలల తరబడి అంతర్మథనాన్ని వెళ్ళగక్కుతున్న ఆమె పెదవుల నుంచి రక్తం కారింది చంద్రం బూటుకాలు పెదవులపై వేగంగా తాకడంతో....

"ఏమండీ"

కాంతమ్మ ఆర్తనాదంతో ఆ ఇల్లు ప్రతిధ్వనించిపోయింది.

ఆక్రందన వినిపించింది విశ్వేశ్వరశాస్త్రి గదిలో నుంచి....

అంతే

బలాన్ని కూడగట్టుకున్న పావని తూలుకుంటూ మామగారి గదిలోకి పరుగెత్తింది.

తనకు సమీపంలోనే జరుగుతున్న మారణహోమాన్ని ఆపలేని నిస్సహాయతో లేక ఇన్ని భరిస్తూ ఇంకా ఎందుకు బ్రతకాలన్న విరక్తో విశ్వేశ్వరశాస్త్రి కళ్ళు తేలేసి ఊపిరందక విలవిల్లాడిపోతున్నాడు.

"మావయ్యా!"

పావని ఆయన పాదాల్ని చుట్టేసింది. ఈ ప్రపంచంలో నన్ను వదిలి వెళ్ళిపోవద్దూ అన్నట్లుగా.

గదిలోకి వచ్చిన చంద్రం పరిస్థితిని గమనించగానే దూకుడుగా పరిగెత్తాడు.

మరో అయిదు నిముషాలలో డాక్టరు వచ్చి పరీక్షించిన వెంటనే ఇంజక్షను చేశాడు.

పోవాల్సిన ప్రాణం ఆగిపోయింది.

"మిస్టర్ చంద్రం" బయటికి వచ్చాక డాక్టరు అన్నాడు "పెరాల్సిస్ వచ్చిన వాళ్ళకి గుండె చాల బలహీనంగా రక్తాన్ని పంప్‌చేస్తూ వుంటుంది. ఏమాత్రం టెన్షన్నీ భరించలేని స్థితిలో వున్నాడాయన. వీలైనంత జాగ్రత్త పడటం మంచిది" ఏయే మందులు వాడాల్సిందీ ప్రిస్క్రైబ్ చేసి వెళ్ళి పోయాడు.

మరో అరగంటలో తేరుకున్నాడాయన.

తన భర్త బ్రతికున్నాడో లేక పసుపు కుంకుమలకే ముప్పు వాటిల్లలేదనో గాని కాంతమ్మ ధైర్యపడింది.

పావనిని చూస్తున్న ఆయన కళ్లలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

* * * *

నానికి

ఒక్క రోజులో తాతయ్య చాలా మారిపోయాడనిపించింది.

ఒక మామూలు పసిపిల్ల వాడే అయితే జరుగుతున్నది చాలా సాధారణంగా స్వీకరించగలిగేవాడే. కాని తాత నేర్పిందీ అమ్మ చెప్పిందీ నానీకి కొత్త ప్రపంచాన్ని

చూపెట్టాయి. అదే యింత కలవరపాటుకి కారణమైపోతూంది.

"అర్థరాత్రి దాటిపోతోంది. పడుకో నానీ" పావని కొడుకుని మరింత దగ్గరగా తీసుకుంటుంటే "ఈవేళ బోలెడన్ని ఆన్సర్లు కరెక్టుగా చెప్పేశాను" అన్నాడు కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

"ఏం జరిగింది?" అడిగింది తనూ ఉత్కంఠగా.

"టీచరేమో ప్రభాత సమయమంటే ఏంటీ అని అడిగింది."

"ఏమన్నావు?"

"సూర్యుడు పడమటి కొండల్లో మాయం కావడం అన్నాను" చెప్పుకుపోతున్నాడు.

"ఆ తర్వాత" అడిగింది పావని.

"అర్థరాత్రంటే ఎప్పుడూ అంది."

"రాత్రి పన్నెండు గంటలవేళ అని చెప్పావా?"

"ఆహ"

"మరి?"

" అమ్మ ఏడ్చేటప్పుడూ అన్నాను."

చెళ్‌మనిపించింది పావనికి. తన కొడుకింత పరిశీలనగా ప్రతి విషయమూ గమనిస్తున్నాడని తెలుసుకుని "అది కాదమ్మా అసలు నేనెందుకేడుస్తాను" అంది తత్తరపాటుతో.

"నాన్న కొడతాడు కాబట్టి."

"నువ్వు తప్పుచేస్తే టీచర్ కొట్టరేంటీ" తన కన్నీళ్ళను దాచేయలని తల మరెటో తిప్పుకుంటుంటే చిన్నచేతుల్తో తన వేపుకు లాక్కున్నాడు.

"నువ్వు తప్పు చేస్తావా అమ్మా...."

"అసలు తప్పంటే ఏంటీ?"

అరక్షణం ఆలోచిస్తూ వుండిపోయింది"మీ నాన్నగారికిష్టంలేని పద్ధతిలో ప్రవర్తించడం".

"మరి తాతయ్య కిష్టం లేని పద్ధతిలో నాన్న ప్రవర్తిస్తారుగా!"

ఆమె జవాబు చెపలేకపోయింది.

"మీ నాన్నగారు తప్పుచేస్తే తాతయ్య చిన్నప్పుడు కొట్టేవారట."

"మరి నిన్ను కొట్టడానికి నువ్వేం చిన్నదానివి కాదుగా."

ఆమె దు:ఖాన్ని ఆపుకోలేకపోయింది.

"తాతయ్య నేను చాలా పెద్దాణ్ణి అయిపోతానని చెప్పాడుగా.... అప్పుడు నిన్ను తాతయ్యని బాగా చూసుకుంటాను.... నాన్నని బాగా ఏడిపిస్తాను".

అసహనంగా కొడుకు పెదవులపై చేతినుంచింది తప్పన్నట్టుగా.... ఆ చిన్ని వయసులో తండ్రిపై అలాంటి ఏహ్యాభావం పెంచుకోవటం ఆమె భరిచలేకపోతుంది.

తన భర్త ద్వేషించేది తననే తప్ప నానీని కాదు. ప్రేమని బాహాటంగా ప్రకటించకపోయినా

ఆమెకు బాగా గుర్తు "నాన్నకి నువ్వంటే చాలా ఇష్టం"

"ఉట్టుట్టికే"

"ఒట్టు" అమ్మ నిజమే చెబుతుందీ, చెప్పమంటుందీ అని తెలిసిన నానీ అయిష్టంగానైనా అమ్మ మాటని అంగీకరించేస్తాడు.

"ఇటు తిరుగమ్మా.... పడుకుందాం" అన్నాడు నానీ.

పావని వెల్లకిలా పడుకోగానే ఒక్కమారు లేచి అమ్మ పొట్టవేపు చూశాడు ప్రేమగా.

ఎప్పుడో ఆ పొట్టలోనుంచే తను బయటికి వచ్చినట్టు అమ్మ చెప్పడంతో దానిపైఎంత మమకారం పెంచుకున్నాడూ అంటే అది కేవలం తన ఒక్కడి సొత్తు అన్నట్లు ఆ పొట్టపై తను కాలుంచి గాని నిద్రపోడు.

గట్టిగా కళ్ళుమూసుకున్న నానీ తల్లి మెడని చేత్తో చుట్టేసి ఆమె పొట్టపై అలవాటుగా కాలుంచాడు.

చురుక్కుమంది పాపనికి అక్కడున్న గాయం రేగడంతో.

సరిగ్గా నానీ కాలుంచిన చోటనే ఓ అరగంట క్రితం భర్త భోంచేస్తూ కోపంగా విసిరిన ప్లేటు తగిలి ఎర్రగా కమిలిపోయింది.

** ** ** **

"సరస్వతీ త్వియం దృష్ట్యా వీణా పుస్తకధారిణే....."

విశ్వేశ్వరశాస్త్రి కంఠంనుంచి జాలువారే సరస్వతీస్తోత్రాన్ని తాతయ్య మంచం ప్రక్కనే కూర్చుని వల్లె వేస్తున్నాడు నానీ.

"హంసవాహన సనాయుక్తా విద్యాధానకరీ" మమ అనలేక ఆయన గొంతు రుద్దమౌతుంటే "తాతయ్య" అంటూ కలవరపాటుగా మంచం కోడుపై ఆనుకొని ఆయన కళ్ళల్లోకి చూశాడు నానీ.

జవసత్వాలుడిగి జీవకళను కోల్పోయిన తాతయ్య లోతు కళ్ళలో తడికి అర్థం వెదికే ప్రయత్నం చేశాడు. కాని ఆ పసిమనసుకి అర్థంకాలేదు ఏ స్మృతి శకలాల ఒరిపిడి ఆయన్నంతగా కదిలించిందీ అనేది.

ఎంతటి మహోత్కృష్టమైన జీవితం ఆయనది....

ఎందరికో ఆరాధ్యుడయ్యిండీ ఏనాడైతే కన్న కొడుకు అతడిపై చెయ్యెత్తాడో ఆనాడే నవనాడులూ కృంగగా పక్షవాతంతో మంచం పట్టాడాయన.

తిరుగులేని రాజసంతో ఆ యింటిని శాసించిన ఆ మనిషి అంపశయ్యపై భీష్ముడై ఓ మారుమూల గదిలో విసిరేయబడ్డాడు. ఆయన కాల కృత్యాలు సైతం తీర్చుకోవాలంటే సహకరించేది భార్య కాదు....కోడలు పావని.

వేళకి అతడి అన్నపానాదులూ చూసేది భార్య కాదు. కోడలు పావనే.

సరిగ్గా ఇక్కడే ముందు విరాగిగా అక్కడినుంచి వేదాంతిగా మారి పోయాడు.

“అయినవాళ్ళంతా నాకేమీ కాకుండా పోతే ఈ వృద్ధుడి కోసం ఎందుకమ్మా యింకా తాపత్రయపడతావు....

నీ బ్రతుకునిలా అన్యాయం చేసిన అలాంటి కొడుకును కన్న నన్ను శపించకుండా ఎలా సేవ చేయగలుగుతున్నావు?” అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి రాగిచెంబుతో నీళ్ళు తెచ్చి తన మొహం తుడుస్తుంటే.

“మావయ్యా” ఆమె కళ్లనుంచి బొటబొటా నీళ్ళు రాలాయి.

“రైలు పెట్టెలో ముందెక్కి సీటుపై కూర్చున్నవాడు వీలయినంత వరకూ మరొకర్ని రానివ్వకుండా జాగ్రత్తపడతాడు. తీరా కొత్తవ్యక్తి తోసుకొచ్చి తిష్టవేయాలని ప్రయత్నిస్తే తరువాత మొదటివ్యక్తి రాజీపడతాడు. సామాజిక పరిణామములో యిది తప్పనిసరయిన మానసిక ప్రవృత్తి” అంది నిర్లిప్తంగా.

“తాతయ్యా.... సరళత్త వచ్చింది” తాత గది ద్వారంనుంచే చూశాడు నానీ సూట్‌కేస్‌తో లోపలికి వచ్చిన సరళని.

“ ఒక్కదానివే వచ్చావా” అంటూ పూజ గదిలోనుంచి బయటికి వచ్చిన కాంతమ్మ కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ అడిగింది.

“ఏం చేయను....మూడురోజులుగా నాన్నగారు వరసగా కలలోకి వస్తుంటే ఆయనతో చెప్పి వచ్చేశాను......అవునూ నాన్నగారెలా వున్నారమ్మా!” అంది అక్కడే కుర్చీలో కూర్చుంటూ.